క్లుప్తంగా

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం పాల్గుణ మాసం ఉత్తరాషాడ నక్షత్రం దశమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలి

చీరాల: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా ఉల్లాస్ అధికారి మనోరంజన్ అన్నారు. చీరాల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉల్లాస్‌కు సంబంధించి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 520 మందికి పరీక్షలు నిర్వహించారు. మండలంలోని దేవాంగపురి, రామకృష్ణాపురం, ఈపూరుపాలెంలో పరీక్షలను నిర్వహించారు. పరీక్షలను డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం కె.మధుసూదనరావు పర్యవేక్షించారు. పరీక్షలను సీసీలు, వీఓలు హాజరయ్యారు.

చినగంజాం: ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ పరీక్షకు 11 మంది గైర్హాజరైనట్లు ఏపీఎం జి. పెద సుబ్బారావు తెలిపారు. నోడల్ అధికారి మధుసూదనరావు, మనోరంజన్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

అద్దంకి రూరల్: మండలంలో 65 సెంటర్లలో పరీక్ష నిర్వహించగా 650 మందికి గాను 592 వయోజనులు హాజరై పరీక్ష రాశారు. 91.07 శాతం మంది పరీక్షకు హాజరైనట్లు అద్దంకి ఎంఈఓ 2 ఆదివారం తెలిపారు.

ఉల్లాస్ పరీక్షకు 575 మంది హాజరు


ఉల్లాస్ పరీక్ష రాస్తున్న మహిళలు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ పరీక్షను వయోజన అభ్యాసకులు 575 మంది రాశారు. 43 మంది గైర్హాజరైనట్లు.. 97 శాతం మంది పరీక్షకు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బల్లికురవ: గ్రామాల వారీగా బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కుసుమ కుమారి ఆదివారం తెలిపారు. 22వ తేదీ వరకు ఉన్న ఈ గడువును బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు మరో మూడు రోజులు పొడిగించారన్నారు. పెద అంబడిపూడి గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపు ఏర్పాటు చేశామని, కార్డులేని చిన్నారులు కొత్త కార్డు పొందేందుకు లోపాలు ఉన్నవారు సరిచేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ వివరించారు.

ఇంకొల్లులో నేత్రదానం


దాత పొత్తూరి పూర్ణచంద్రరావు

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లుకు చెందిన పొత్తూరి పూర్ణచంద్రరావు ఆదివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవ దాన కమిటీకి సమాచారం అందించి నేత్రాలను దానం చేశారు. గుంటూరు శంకర కంటి వైద్యశాల వైద్యులు శ్రీనిజ, శ్రీలతలు దాత కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులు భార్య కాశి అన్నపూర్ణ, ఉషారాణి, అంజనీకుమార్, శ్రీలత, కృష్ణకిషోర్, వాసుదేవరావులను రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి), అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు కుటుంబ సభ్యులను అభినందించారు.

అంధకారంలో మక్కెనవారిపాలెం

సంతమాగులూరు (అద్దంకిరూరల్): సంతమాగులూరు మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో విద్యుత్ లైన్ల లోపాలు (లూజ్ కనెక్షన్) వల్ల గత మూడు రోజుల నుంచి కరెంట్ లేకపోవటంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రివేళల్లో దోమ దండయాత్రతో కంటిమీద కునుకు ఉండటంలేదని వాపోతున్నారు. ఇక 10 వతరగతి పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థుల బాధ వర్ణనాతీతంగా మారింది. సంబంధిత లైన్‌మేన్‌కు సమాచారం అందించిన ఎటువంటి స్పందన రావటంలేదు దయవుంచి ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి కరెంటు అందించాల్సిందిగా కోరుతున్నారు.


చీకటిలో ఉన్న మక్కెనవారిపాలెం గ్రామం

నూనె ధరలతో షాక్

- లబోదిబోమంటున్న వినియోగదారులు
- ధరల తగ్గింపుపై దృష్టి సారించని ప్రభుత్వం



అద్దంకి: నిత్యావసర వస్తువుల్లో అతి ముఖ్యమైనది వంట నూనె. ఇది ఉంటేనే ఏ కూర చేయాలన్నా సాధ్యం. 2024లో కేంద్ర ప్రభుత్వ అనాలోచిన నిర్ణయం వినియోగదారుల నెత్తిన పిడుగు పడింది. దీంతో పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్ ధరలు ఆకాశాన్ని అంటాయి. ఎప్పుడూ లేని విధంగా పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్ లీటర్ ప్యాకెట్ ధర ఒక్కసారే రూ.40 మేర పెరగాయి. ఇప్పటికీ అదే ధర కొనసాగుతోందని వినియోగదారులు వాపోతున్నారు. శనగ నూనె లీటర్ ప్యాకెట్ ధర రూ.140 నుంచి రూ.175 వరకు రకాన్ని బట్టి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం దీని ధర నిలకడగానే ఉంది. అయితే గత సంవత్సరం ఆగస్టు నుంచి నూనెల ధరలను పరిగణలోకి తీసుకుంటే శనగ నూనె ధర స్థిరంగా ఉన్నా, పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్ ధరలకు రెక్కలొచ్చాయి.

కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతోనే ధరల పెంపు

గతంలో పామాయిల్ దిగుమతిపై రూ.12 శాతం జీఎస్టీ ఉండుగా.. దాన్ని రూ.33 శాతానికి కేంద్రం పెంచింది. దాంతో అంతకు ముందు లీటరు నూనె ప్యాకెట్ ధర రూ. 85 నుంచి రూ.90 ఉండగా, జీఎస్టీ పెరుగుదలతో రూ. 140 నుంచి 150 (లూజ్ అయిల్ 150)కి చేరుకుంది. హోల్ సేల్ మార్కెట్‌లో రూ.135కు ఇస్తున్నారు. అదే విధంగా సన్‌ఫ్లవర్ అయిల్ రూ.112 నుంచి రూ.115 ఉండగా ప్రస్తుతం రూ.155కి చేరుకుంది.

అద్దంకి నియోజకవర్గంలో..

మొత్తంమీద 105 గ్రామాలు ఉండగా..సుమారు లక్ష గృహాలు ఉంటాయి. ఈ లెక్కన నెలకు సరాసరిన 10 లక్షల ప్యాకెట్లు.. అంటే 3 లక్షల కిలోల వినియోగం జరుగుతుంది. అంటే అదనంగా 30 లక్షల రూపాయల భారం పసడినట్లే. ఈ వంతున ఏడాదికి రూ.3.6 కోట్ల భారం పడినట్లవుతుంది.

ఇతర సరుకులూ ఇంతే..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కందిపప్పు, ఉల్లిపాయలు, వంటనూనెల ధరలే కాకుండా, కందిపప్పు, ఉల్లిపాయలు, తదితర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో సమాన్యులు విలవిల్లాడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా నిత్యావసరవస్తువుల ధరలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అయితే వ్యాపారులు మాత్రం గతం కన్నా నూనె ధర పెరగడంతోనే ధర పెంచక తప్పక పెంచాలని చెబుతున్నారు. హోల్‌సేల్‌లో తగ్గిస్తే.. తగ్గిస్తామని చెబుతున్నారు.

> **నూనె ధర తగ్గించాలి**
> నూనె ధర బాగా పెరిగిపోయింది. గతంలో 90 ఉండే పామాయిల్ ఇప్పుడు 140కి చేరుకుంది. 115 ఉండే సన్‌ఫ్లవర్ అయిల్ ఇప్పుడు 150 నుంచి 155కు చేరుకుంది.
> – కృష్ణవేణి

విశిష్ట సేవలకు ఉగాది పురస్కారాలు


ట్రస్టు తరఫున ఉగాది పురస్కారాలను అందుకున్న గ్రహీతలు

చీరాల అర్బన్: పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురికి బత్తుల సర్వీస్ ట్రస్ట్–చీరాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో ఉగాది పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సాహితి, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ప్రవేశమున్న పది మందికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ హాజరై ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. విశిష్ట అతిథిగా హాజరైన నరసరావుపేట డీఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి మనిషి తప్పనిసరిగా సామాజిక కార్యక్రమాలను చేయాలన్నారు. ప్రతి మనిషి సంతృప్తికరంగా ఉండాలంటే సమాజసేవ చేయాలన్నారు. అనంతరం వూరా మస్తాన్‌రావు, వెల్లంకి కృష్ణమూర్తి, కర్ణ సుబ్బారావు, పోలుదాసు రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, అంగలకుదిటి నాగవీర భద్రాచారి, పాలిమెర సంతోష్‌కుమార్, కడలి అప్పారావు, గుత్తి విశ్వేశ్వరరావు, కూరపాటి నారాయణరావును సత్కరించి ఉగాది పురస్కారాలను అందించారు. అనంతరం గాదె హరిహర రావు వందన సమర్పణ చేశారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి వడలి రాధాకృష్ణ, భాగి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేకం నిర్వహణకు ఏర్పాట్లు


శింగరకొండ దేవస్థాన ఏసీతో సమావేశమైన దేవస్థాన అర్చకులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం నూతన రాతి ముఖ మండపం నిర్మించనున్నారు. దీనిలో భాగంగా నిర్వహించనున్న కుంభాభిషేక ఏర్పాట్లును ఆదివారం దేవస్థాన అర్చకులు దేవస్థాన ఏసీ యం. తిమ్మనాయుడుతో చర్చించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ కుంభాభిషేకం నిర్వహణలో ఎటువంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలని అర్చకులకు కావాల్సినవి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమానికి శృంగేరి మఠం పీఠాధిపతులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

కమనీయం స్వామి కల్యాణం


మార్టూరు: స్వామివారి మంగళసూత్రాన్ని భక్తులకు ప్రదర్శిస్తున్న అర్చక వేణుగోపాల దీక్షితులు


కళ్యాణానికి పెద్ద ఎత్తున హాజరైన భక్తులు

మార్టూరు: స్థానిక జాతీయ రహదారి పక్కన గల శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. తిరుమల టీటీడీ ఆలయ పండితులు అర్చక వేణుగోపాల దీక్షితుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస కళ్యాణానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

గంగమ్మతల్లికి కుంకుమ పూజలు

కారంచేడు: గ్రామదేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున కుంకమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజుగా భావిస్తారు. దీంతో మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన గ్రామదేవత గంగమ్మతల్లికి అభిషేకాలు నిర్వహించారు.


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గ్రామ దేవత గంగమ్మతల్లి

రోటరీ కమ్యూనిటీ హాలు పునఃప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్రం మల్లేశ్వర రావు

చీరాల: రోటరీ క్లబ్, ప్రోబస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధుల సహకారంతో వేటపాలెంలోని రోటరీ కమ్యూనిటీ హాలు మరమ్మతుల అనంతరం క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి సీతారాం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ పూర్వపు అధ్యక్షుడు కె.శివరామకృష్ణ మరమ్మతులకు సహకరించిన రోటరీ, ప్రోబస్ క్లబ్, ఇంకొల్లు రోటరీ క్లబ్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. పేరాల ఏఆర్‌ఎం హైస్కూల్ ఉపాధ్యాయులు, కవి, రచయిత మంత్రి కృష్ణమోహన్ వచన కవిత్వంలో రైతు జీవితం అనే అంశంపై ప్రసంగించారు. ప్రోబస్ క్లబ్ అధ్యక్షుడు ఆవుల పున్నయ్య, ఉపాధ్యక్షుడు బుద్ది సుబ్బరామయ్య, విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు, బండ్ల బాపయ్య విద్యా సంస్థల కమిటీ కరస్పాండెంట్ చల్లా వాసుదేవరావు, వీఆర్‌ఎస్‌వైఆర్ ఎస్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.రవికుమార్, ప్రత్తి వెంకట సుబ్బారావు, నున్నా నాగేంద్రరావు, కొసనం నాగమాంబ, వలేటి సుబ్బారావు, కోడూరి రంగనాయకులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన


పర్చూరు బొమ్మల సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

పర్చూరు(చినగంజాం): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పర్చూరులో దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక బొమ్మల సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా అడుగులు వేయడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత బొమ్మల సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు వడ్డిముక్కల అబ్రహం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలంటే ముందు కులగణన చేపట్టాలన్నారు.

కూరాకులు ఇస్సాక్ మాట్లాడుతూ దళితులు ఐక్యంగా ఉండి వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గేరా స్వరాజ్ కుమార్, కట్టా రత్నరాజు, చింతా సురేష్, జంగా వంశీ, నలిగల నాని, జూపూడి రోశయ్య, గుజ్జర్లపూడి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి


భగత్‌సింగ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న కోట వెంకటేశ్వర రెడ్డి


అద్దంకి: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చీరాల రూరల్: ఊరూరా జనవిజ్ఞానం, చీరాల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, వేమన సాహితీ సమితి అభ్యుదయ భావాల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఘంటసాల విగ్రహం వద్ద భగత్‌సింగ్ 95వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. భగత్‌సింగ్ కలలుకన్న మహోన్నత భారతదేశం ఇంకా మిగిలే ఉందని చెప్పారు. సంపూర్ణ స్వాతంత్ర్యం, లౌకికవాదం, సమసమాజం, ప్రజాస్వామ్యం ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదని చెప్పారు. ఆయన చిన్న వయస్సులోనే విప్లవ భావాలను పుణికిపుచ్చుకున్నారని, 1917లో సోషలిస్ట్ రష్యా విప్లవ ప్రభావాలకు లోనై.. యువకుడైన భగత్‌సింగ్‌పై విపరీతమైన ప్రభావం చూపాయని చెప్పారు. భగత్‌సింగ్ రాసిన వీలునామా, జైలు డైరీ లేఖలు, కవితలు నేటితరం యువత చదవాలని భగత్‌సింగ్ అభ్యుదయ భావాలతో స్ఫూర్తి పొందాలని సూచించారు. కార్యక్రమంలో గాదె హరిహరరావు, ఎ. నాగవీరభద్రచారి, బక్క జయరామిరెడ్డి, బి. చినబాబు, ఎం. మణిబాబు, జంగం రమేష్, గోలి జోజిబాబు, ఎస్‌కే సుభాని, నాగరాజు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం భగత్ సింగ్ 94 వవర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంగాధర్

మార్టూరు: స్థానిక జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హైవే మొబైల్ సిబ్బంది రవి వివరాలు ఇలా ఉన్నాయి.. విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఐషర్ లారీలో ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. శనివారం అర్ధ రాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై ఇసుక దర్శి ఫ్లైఓవర్ దిగే క్రమంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం హఠాత్తుగా ఆగింది. ఇది ఊహించని ఐషర్ లారీ డ్రైవర్ ముందు వెళుతున్న వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ప్రమాద ధాటికి ఐషర్ వాహనం క్యాబిన్ ధ్వంసం కాగా ముందు వెళ్తున్న వాహనం వెళ్ళిపోయింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ ప్రభాకర్ మరో వ్యక్తి గంగాధర్ తీవ్రంగా గాయపడ్డారు. హైవే మొబైల్ సిబ్బంది సమాచారంతో ఆటో 108 సిబ్బంది క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైవే మొబైల్ సిబ్బంది ఐషర్ వాహనాన్ని పక్కకు తరలించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేశారు.

సాదాసీదాగా చీమకుర్తి మండల పరిషత్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

చీమకుర్తి రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 16వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇప్పటివరకు మండల పరిధిలో మండల పరిషత్ నిధులతో 902 పనులకుగానూ సుమారు 26 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. 12 కోట్ల రూపాయలతో మండలంలో తారురోడ్లు వేసినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి నూతన స్తంభాల ఏర్పాటుకు విద్యుత్‌శాఖ ద్వారా కోటి ఇరవై ఐదు లక్షల రూపాయలతో పనులు చేయించినట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు వారి గ్రామాల అభివృద్ధి కోసం సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనుల నిమిత్తం ఎంపీపీకి అర్జీలు అందజేశారు. సమావేశంలో ఎంపీడీఓ కె.రాఘవేంద్ర, సర్పంచులు, ఎంపీటీసీలు, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

కారంచేడు: పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసిన పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వి. వెంకట్రావు తెలిపిన వివరాలు.. ఖాళీగా ఉన్న వ్యవసాయ భూముల్లో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 3400 నగదును కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేశామని తెలిపారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన భూమిరెడ్డి రమణమ్మ

ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డిని ఒంగోలులోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతిచెందిన నేపథ్యంలో సుబ్బారెడ్డిని రమణమ్మ కలిసి పరామర్శించారు. ఇటీవల జనసేన పార్టీ మహిళా నాయకులు తనపై దాడిచేసిన విషయాన్ని సుబ్బారెడ్డి దృష్టికి రమణమ్మ తీసుకెళ్లారు. ఆమె వెంట సాధన విజయలక్ష్మి ఉన్నారు.

చీమకుర్తి మండలంలో 900 మంది హాజరు...

చీమకుర్తి రూరల్: మండలంలో ఉల్లాస్ మదింపు పరీక్షకు 900 మంది అభ్యాసకులు హాజరవగా, 8 మంది గైర్హాజరైనట్లు వయోజనవిద్య ఉల్లాస్ కన్వీనర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. అభ్యసించిన వారికి ఆదివారం 18 అంగన్‌వాడీ కేంద్రాల్లో మదింపు పరీక్ష నిర్వహించినట్లు ఎంపీడీఓ కె.రాఘవేంద్ర తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ–1 నరసింహారావు, ఎంఈఓ–2 శివాజీ, ఏపీఎం రాజ్యలక్ష్మి సందర్శించి పర్యవేక్షించారు.

అలంకరణలో ఈర్ల గంగమ్మ


అలంకరణలో ఈర్ల గంగమ్మ

బల్లికురవ: భక్తులు, గ్రానైట్ వ్యాపారుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈర్ల గంగమ్మకు ఆదివారం వివిధ గ్రామాల భక్తులు మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్కబొక్కలపాడు, బల్లికురవ, కొత్తపాలెం, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొత్తమల్లాయ పాలెం, పాత మల్లాయపాలెం, కొప్పరపాలెం గ్రామాలకు చెందిన భక్తులు ఉదయం 6 గంటల నుంచే ఆలయ సన్నిధానం వద్దకు చేరి పొంగళ్లుపెట్టి అమ్మవారికి నివేదించి తమతమ మొక్కులు తీర్చుకున్నారు. నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన ధూళిపాళ్ల తాతారావు తన వార్షిక మొక్కు చెల్లింపులో భాగంగా అమ్మవారిని బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరింప చేశారు. అనంతరం ఆలయ సన్నిదానం వద్ద అన్నసంతర్పణ చేపట్టారు. ఆలయ అర్చకులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.